సాక్షి
హనుమకొండ

గురువారం | 26 | జనవరి | 2023



ఘనంగా శుద్ధి పండుగ
మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ గుడి శుద్ధి పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు.
- 8లో▸



సెమిస్టర్ల ఫలితాలు విడుదల
హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) డిగ్రీ కోర్సుల 3వ, 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేశారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.6^0 /22.7^0

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పలువురు ఐపీఎస్‌ల బదిలీ

వరంగల్ క్రైం: ఉమ్మడి జిల్లాలో పలువురు ఐపీఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి బదిలీ చేసింది. సీహెచ్ సింధుశర్మ, జగిత్యాల ఎస్పీ నుంచి మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్‌గా వచ్చారు. ఇప్పటివరకు ఆ పోస్టు ఉన్న డి.శివ ప్రసాద్ బదిలీ అయ్యారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ వైభవ్ గైక్వాడ్‌కు పదోన్నతి కల్పిస్తూ పెద్దపల్లి డీసీపీగా బదిలీ చేశారు. అశోక్ కుమార్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పోలీస్ గ్రేహౌండ్స్ నుంచి ములుగు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా బదిలీ అయ్యారు. ఈస్ట్‌జోన్ డీసీపీ కె.వెంకటలక్ష్మి సీఐడీ ఎస్పీగా బదిలీకాగా, ఆమె స్థానంలో పుల్ల కరుణాకర్ (నాన్‌కేడర్) వచ్చారు. ఎంఏ బారి (నాన్‌కేడర్) సెంట్రల్‌జోన్ డీసీపీగా వచ్చారు. పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా సతీష్ చోడగిరి రాగా, ఇప్పటివరకు ఆ స్థానంలో ఉన్న ఇంజారపు పూజను రాష్ట్ర పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

ఫార్మా డీ ఫీజు చెల్లించేందుకు గడువు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఫార్మా డీ విద్యార్థులు రెండు, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫీజు (సప్లిమెంటరీ అండ్ ఇంప్రూవ్‌మెంట్) ఫిబ్రవరి 4 వరకు చెల్లించాలని యూనివర్సిటీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించేందుకు గడువు అపరాధ రుసుము లేకుండా ఫిబ్రవరి 4 వరకు, రూ.250 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 7 వరకు చెల్లించుకోవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. కేయూ వెబ్‌సైట్‌లోనూ వివరాలు అందుబాటులో ఉంచారు.

28, 30 తేదీల్లో బీటెక్ సెమిస్టర్ పరీక్షలు


కేయూ క్యాంపస్: కేయూ బీటెక్ వివిధ బ్రాంచీల సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) గతంలో వాయిదా పడిన విషయం తెలిసిందే. వాటిని ఈనెల 28, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక బుధవారం తెలిపారు. ఆయా పరీక్షలు వివిధ కళాశాలల పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



ఎంజీఎం : కలెక్టర్ ఆదేశాలతో హనుమకొండలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో బుధవారం వైద్యారోగ్యశాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. విశ్వాస్ హాస్పిటల్, సాయిమాత్రిక ఫెర్టిలిటీ సెంటర్, శ్రీ లలిత, లాస్య ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. గర్భిణులకు స్కానింగ్ చేసినప్పుడు అనుమతించిన వైద్యులు మాత్రమే చేయాలని, ఎంత మందికి స్కానింగ్ నిర్వహించారో వివరాలు ఫారం–ఎఫ్‌లో పొందుపరచాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల్లో కచ్చితంగా లింగనిర్ధారణ పరీక్షలు చేయబోమని టోల్‌ఫ్రీ నంబర్ కలిగి ఉన్న బోర్డులను స్కానింగ్ గది, విజిటర్లు కూర్చునే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకబ్‌పాషా, డెమో అశోక్‌రెడ్డి, సీహెచ్ఓ మాధవరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'కంటివెలుగు' శిబిరం



హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో కంటివెలుగు శిబిరాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు బుధవారం ప్రారంభించారు. ప్రతి ఉద్యోగి కంటివెలుగులో తమ కళ్లను పరీక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. డీఎంహెచ్ఓ సాంబశివరావు, డీఆర్‌డీఓ ఆకవరం శ్రీనివాస కుమార్, డీఆర్వో వాసుచంద్ర, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ రావు, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.


9మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం ఆదిలాబాద్ జిల్లాల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 9మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

నిధులొచ్చేనా..!?

గత బడ్జెట్‌లో కేటాయించినా.. అరకొరగానే విడుదల

- ఉమ్మడి జిల్లా సాగునీటిప్రాజెక్టులు, నిధుల అవసరంపై ఆరా
- బడ్జెట్ ఎస్టిమేషన్‌లు సమర్పించిన ఇరిగేషన్ అధికారులు
- దేవాదుల, కాళేశ్వరం, ఎస్సారెస్పీ–2 తదితరాలకు ప్రతిపాదన
- సుమారు రూ.2,580 కోట్లు అవసరమని అంచనాలు?
- 2023–24 బడ్జెట్‌పైన ఆశలు.. నిధులు పారితేనే ప్రాజెక్టులు పూర్తి..



సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమాల్లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కీలకమైంది. అందులో ఉమ్మడి వరంగల్ మేడిగడ్డ కేంద్రంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. జేసీఆర్ దేవాదుల, పీవీ కంతనపల్లి ప్రాజెక్టులు ప్రాధాన్యతగా తీసుకున్నవే. ఎస్సారెస్పీ స్టేజ్–2తో పాటు చిన్ననీటి వనరుల కోసం గతేడాది బడ్జెట్‌లో కేటాయించినా.. ఆ మేరకు విడుదల కాలేదు. ఎన్నికల ఏడాది కావడంతో వచ్చే నెల అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు నిధుల పారుదలపై ఆశలు రేకెత్తుతున్నాయి.

మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)

ప్రాజెక్టు	2020-21	2021-22	2022-23
కాళేశ్వరం ప్రాజెక్టు	805.478	918.00	2,506.24
జేసీఆర్ దేవాదుల	77.47	84.09	339.98
పీవీఆర్ కంతనపల్లి	73.83	21.02	42.51
ఎస్సారెస్పీ-2	61.40	11.00	20.00
పాకాల సరస్సు	0.41	6.02	7.50
రామప్ప	0.81	1.50	7.50
లక్నవరం	0.41	0.70	0.75

నిధులు పారితేనే పూర్తయ్యేది...

ఉమ్మడి వరంగల్‌లోని ప్రాజెక్టులకు గడచిన మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఆశించిన స్థాయిలో రాలేదు. జిల్లా జలవనరులశాఖ అధికారులు ఏటా పెద్ద ఎత్తున నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నా 35 శాతం కూడా కేటాయించడం లేదు. దీంతో ప్రాజెక్టు పెండింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం, జేసీఆర్ దేవాదుల, పీవీఆర్ కంతనపల్లి, ఎస్సారెస్పీ–2లతో పాటు మిగిలిన ప్రాజెక్టుల పరిధిలో సుమారు 7.98 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. పెండింగ్ పనులు పూర్తయితే 9.97 లక్షల ఎకరాలకు సాగునీరు పారుతుందని అధికారుల అంచనా. 2004లో రూ.6,084 కోట్లున్న దేవాదుల అంచనా వ్యయం 2020 జూన్ నాటికే రూ.14,945 కోట్లకు పైగా పెరిగింది. ఐదేళ్లలో పూర్తి కావాల్సి ప్రాజెక్టు 19 ఏళ్లవుతున్నా పూర్తి కావడం లేదు. గతేడాది రూ.2,506.24 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినా 25 శాతం కూడా విడుదల చేయలేదు. కాళేశ్వరం మూడో టీఎంసీ, కంతనపల్లి, సమ్మక్కసాగర్ ప్రాజెక్టులది ఇదే పరిస్థితి.

రుణాలతో నెట్టుకొస్తున్నా..

ఎన్నో ఏళ్లుగా నిర్మాణంలో ఉన్న కొత్తగా చేపట్టిన ఐదు ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేందుకు తెలంగాణ జలవనరుల అభివద్ధి కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకోవడానికి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన శ్రీరామసాగర్ వరద కాలువ, దేవాదుల, సమ్మక్క బ్యారేజీలు కూడా ఉన్నాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్(ఆర్ఐసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎస్‌సీ)ల నుంచి ఈ ఐదు ప్రాజెక్టులకు రూ.19.842.53 కోట్ల రుణం ఇచ్చేలా ఒప్పందం జరిగింది. రూ.14,253 కోట్లు బ్యాంకులు ఇచ్చాయి. మరో రూ.5,388 కోట్లు విడుదల దశలో ఆగిపోయాయి. దీంతో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడింది.

ఈసారి భారీగా ప్రతిపాదనలు..

అదనపు ఆయకట్టుకు సాగునీరు అందాలంటే ఇప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాల్వలు, తూములు, పిల్ల కాల్వలు, వంతెనలు, పాత కాల్వలు మరమ్మతులు చేయాలి. మూడో టీఎంసీ, దేవాదుల, ఎస్సారెస్పీ–2 భూసేకరణ, పరిహారం వంటి సమస్యలను పరిష్కరించాలి. దీనికి నిధులు భారీగానే అవసరం. 2023–2024 బడ్జెట్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు ఏ మేర అవసరమో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు సుమారు రూ.2,580 కోట్లు అవసరం ఉంటాయని ప్రతిపాదించినట్లు సమాచారం.

దేవాదుల కాల్వల పూర్తికి ఇంకెన్నాళ్లు



దేవాదుల ప్రాజెక్టు కింద కొన్ని ప్రాజెక్టులు, ట్యాంకులు పూర్తి చేయాల్సి ఉంది. జనగామ జిల్లాలో భూసేకరణతో పాటు మెయిన్ కెనాల్స్, ఫీల్డ్ ఛానెల్స్ పూర్తి చేయడానికి డబ్బులు లేకపోవడమే కారణం. తాత్కాలికంగా చెరువులు నింపి చేతులు దులుపుకుంటున్నారు. కాలువల కింద పంటలు సాగైనప్పుడే ప్రభుత్వం ఆశించిన మేర లక్ష్యం నెరవేరుతుంది. వెంటనే భూ సేకరణకు, కాల్వల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించాలి.

– రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జనగామ

కరువు ప్రాంతాల్లోనే పెండింగ్ పనులు



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కరువు ప్రాంతాలైన జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, చుట్టుపక్కల నియోజకవర్గాలలో పనులు నిధులు లేక నిలిచిపోయాయి. సాగునీటితో సస్యశ్యామలం కావాలంటే ఏకైక మార్గం దేవాదుల పూర్తిస్థాయిలో నిర్మాణం చేయడం. కానీ ప్రతిసారి బడ్జెట్‌లో సరైన కేటాయింపు లేకపోవడం వల్ల గడిచిన 19 సంవత్సరాల నుంచి దేవాదుల ప్రాజెక్టు నీరు అందని ద్రాక్షగానే ఉండి పోయింది.

– బేజాటి బీరప్ప, చార్టెడ్ అకౌంటెంట్

నిధుల కొరతతో అసంపూర్తిగా..



చాలా ప్రాజెక్టులు నిధుల కొరతతో అసంపూర్తిగా ఉన్నాయి. దేవాదుల గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తిగా చేసి ఎగువ ప్రాంత రైతాంగాన్ని ఆదుకునేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. పేదలకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వం ఇళ్లు కట్టించేందుకు లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించాలి. వరంగల్ నగరంలో ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలను నెలకొల్పేందుకు నిధులు ఇవ్వాలి.

– కర్రె భిక్షపతి, జిల్లా కార్యదర్శి, సీపీఐ, హనుమకొండ

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

పోలీస్ కమిషనర్ రంగనాథ్

హన్మకొండ అర్బన్: ఓటు ప్రాధాన్యత గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, అందుకోసం అధికారులు తమ వంతు కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, అలాంటి దేశంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ ఓటరుగా ఒక చోట కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదై ఉంటే స్వచ్ఛందంగా మిగతా చోట్ల తొలగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కేంద్ర ఎన్నికల కమిషన్ సందేశం విన్నారు. యువ ఓటర్లు, బీఎల్ఓలను సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఓటుపై ప్రతిజ్ఞ చేస్తున్న హనుమకొండ కలెక్టర్, సీపీ ఇతర అధికారులు

28న గొర్రె పిల్లల బహిరంగ వేలం

మామునూరు: డిప్యూటీ జనరల్ ఆఫ్ ప్రిజన్స్, వరంగల్ రేంజ్, హైదరాబాద్ ఆదేశాల మేరకు ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలోని మోడల్ కేంద్ర కారాగారంలో ఈ నెల 28వ తేదీన ఉదయం 10గంటలకు 25 గొర్రె పిల్లల(ఆడ, మగ) బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కేద్రం కారాగారం పర్యవేక్షణాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు రూ.5 వేలు ధరావత్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

'మెడికల్' పత్రాలు అప్‌లోడ్ చేయాలి

- పదోన్నతులు, బదిలీలపై టీచర్లకు డీఈఓ అబ్దుల్‌హై పలు సూచనలు

విద్యారణ్యపురి: జిల్లాలో పదోన్నతులు, బదిలీల నేపథ్యంలో ఉపాధ్యాయులకు డీఈఓ ఎండీ అబ్దుల్ హై బుధవారం పలు సూచనలిచ్చారు. దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన ఉపాధ్యాయులు మెడికల్ ధ్రువీకరణ సర్టిఫికెట్లను బదిలీలు, పదోన్నతుల సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగుల పిల్లల విషయంలోనూ సంబంధిత మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. డీపీ (పీహెచ్‌సీ) అభ్యర్థులు సదరం జారీ చేసిన ధ్రువపత్రాలు, స్పౌజ్ కేట గిరీ వినియోగించుకోవాలనున్న ఉపాధ్యాయులు సంబంధిత అధికారులతో జారీ చేసిన తాజా సర్వీస్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. పదోన్నతులు పొందాలనుకునే ఉపాధ్యాయులంతా తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరవ్వాలని కోరారు.



సర్వీస్ బుక్స్, సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

ఎస్ఏల సర్వీస్ బుక్స్ పరిశీలన

జిల్లాలో హెచ్ఎంల పదోన్నతులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల సర్వీస్‌బుక్స్ పరిశీలన బుధవారం హనుమకొండ డీఈఓ కార్యాలయంలో నిర్వహించారు. డీఈఓ ఎండీ అబ్దుల్‌హై పర్యవేక్షణలో ఏడు కౌంటర్లలో ఒక్కో కౌంటర్‌లో రెండు మండలాల స్కూల్ అసిస్టెంట్ల సర్వీస్ బుక్స్‌ను గెజిటెడ్ హెడ్మాస్టర్లు, ఇతర సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ప్రక్రియ రాత్రి 8గంటల వరకు కొనసాగింది. 383మంది ఎస్ఏలలో 90శాతంమందికి పైగా హాజరయ్యారని డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు.

27న మండల కేంద్రాల్లోనే..

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ), బాషా పండితులు ఈ నెల 27న సంబంధిత మండల కేంద్రాల్లో ఎంఈఓలతో ఒరిజినల్ సర్వీస్ బుక్స్ పరిశీలన చేయించుకోవాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి ఎండీ అబ్దుల్‌హై బుధవారం కోరారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలు.. వారి సర్వీస్‌బుక్స్‌ను పరిశీలించాక అదే రోజు సాయంత్రం 5గంటలకు వివరాలను డీఈఓ కార్యాలయానికి పంపాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: అభివృద్ధి సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని, తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉండాలని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్ మండలం భీంపల్లిలో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని, రూ.16 లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని, రూ.10 లక్షల చొప్పున నిర్మించిన శాలివాహన, రజక కుల సంఘ భవనాలను, రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వం వచ్చాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతుండడంతో నేడు ఇక్కడ పండుగ వాతావరణం కనిపిస్తోందన్నారు. గత ఎన్నికల్లో భీంపల్లి ప్రజలు కేసీఆర్‌ను మర్చిపోయినా కేసీఆర్ మాత్రం భీంపల్లిని మర్చిపోలేదన్నారు. అనంతరం కమలాపూర్‌లో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయ ఆవరణలో గౌడ కులస్తులతో సమావేశమై ఈ నెల 31న కమలాపూర్‌లో మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ కళ్యాణి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, సర్పంచ్ పద్మకుమారస్వామి, తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ పల్లవి, సంబంధిత శాఖల అధికారులు, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, తదితరులు

అధికార పార్టీ నాయకుడికి బెదిరింపు కాల్స్

దామెర: మండలానికి చెందిన అధికార పార్టీ ముఖ్య నాయకుడికి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ సంఘటన ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. అధికార పార్టీకి చెందిన మండల ముఖ్యనాయకుడికి ఈ నెల 18న ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్‌చేసి 'నువ్వు గుప్తనిధుల తవ్వకాలు చేయగా వాటికి సంబంధించిన ఆధారాలు నా వద్ద ఉన్నాయి' అని బెదిరించాడు. తనకు రూ.2లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఈ ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారంచేసి తన రాజకీయ జీవితాన్ని నాశనం చేస్తానని హుకుం జారీ చేశాడు. డబ్బులు ఇవ్వని పక్షంలో చంపుతానని బెదిరిస్తున్నాడని, సదరు అజ్ఞాత వ్యక్తి ద్వారా తనకు ప్రాణభయం ఉందని బాధితుడు ఈ నెల 23న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సదరు అజ్ఞాత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటికి రాకుండా పోలీసులు గోప్యత పాటించడం.. మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఇద్దరికి ఇండియన్ పోలీస్ మెడల్

- వరంగల్ సీపీగా పనిచేసిన తరుణ్‌జోషి, టీఎస్ఎస్పీ ఆర్ఐ దయాశీల ఎంపిక
- పనిలో నిబద్ధత, సేవకు తగిన గుర్తింపు



తరుణ్‌జోషి



కారుకొండ దయాశీల

వరంగల్‌క్రైం/మామునూరు: పోలీస్‌శాఖలో విశిష్టమైన సేవలు అందించినందుకుగాను ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు అధికారులకు ఇండియన్ పోలీస్ మెడల్(ఐపీఎం) దక్కింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రం ఈ అవార్డులను ప్రకటించింది. అందులో ఒకరు ఇటీవల బదిలీ అయిన వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ పి.తరుణ్‌జోషికాగా, మరొకరు మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ఆర్ఐ కారుకొండ దయాశీల.

గంజాయి రహిత కమిషనరేట్‌గా మార్పుకు కృషి

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన డాక్టర్ తరుణ్‌జోషికి కేంద్ర ప్రభుత్వం పోలీస్ మెడల్ ప్రకటించింది. 2021 ఏప్రిల్ 7 నుంచి 2022 డిసెంబర్ 2 వరకు సీపీగా పనిచేసిన డాక్టర్ తరుణ్‌జోషి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నివారణకు కృషి చేశారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాలనుంచి కమిషనరేట్ మీదుగా రవాణా అవుతున్న గంజాయిని అరికట్టడంతోపాటు భారీ ఎత్తున పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారు. మత్తు పదార్థాలకు బానిసలైన యువతను సన్మార్గంలో పెట్టడానికి నయా కిరణ్ పేరుతో రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి విముక్తి కల్పించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ క్రైం నేరాలు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 'వరంగల్‌లో చేసిన కార్యక్రమాలకు ఐపీఎం అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది' అని తరుణ్‌జోషి 'సాక్షి'కి తెలిపారు. కమిషనరేట్ పోలీస్ అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమైందని ఆనందం వ్యక్తం చేశారు.

టీఎస్ఎస్పీ ఆర్ఐ దయాశీలకు..

ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న కారుకొండ దయాశీలకు మంచి పేరుంది. క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ దయాశీలకు కేంద్ర హోంశాఖ గుర్తించి ఐపీఎం అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డును దయాశీల త్వరలోనే డైరెక్టర్ ఆఫ్ జనరల్ చేతులమీదుగా అందుకోనున్నారు. రిపబ్లిడే సందర్భంగా తనకు ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని దయాశీల తెలిపారు. మెడల్ దక్కేందుకు సహకారం అందించిన టీఎస్ఎస్పీ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డితోపాటు రాష్ట్ర పోలీస్‌శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టరేటా.. పరేడ్‌గ్రౌండా..?



విద్యుత్ వెలుగుల్లో హనుమకొండ కలెక్టరేట్ సముదాయం

- హనుమకొండ జిల్లాలో గణతంత్ర వేడుకలకు రెండు చోట్లా ఏర్పాట్లు
- మొదట కలెక్టరేట్ ముస్తాబు..
- హైకోర్టు తీర్పుతో పరేడ్‌గ్రౌండ్‌లో సదుపాయాలు
- తలలు పట్టుకుంటున్న అధికారులు



హనుమకొండ పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేసిన సిబ్బంది

హన్మకొండ అర్బన్: ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం.. మరోవైపు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు.. దేనిని ఫాలో కావాలి... గణతంత్ర వేడుకలు ఎక్కడ నిర్వహించాలి అన్నది హనుమకొండ జిల్లా యంత్రాంగానికి పెద్ద సవాల్‌గా మారింది. దీంతో ప్రభుత్వంనుంచి అర్ధరాత్రి ఏ సమయంలోనైనా వేడుకల వేదిక మార్చాలని ఆదేశాలు వస్తే ఎలా అన్న సందిగ్ధంలో ఉన్నారు. ఎందుకైనా మంచిదని అటు కలెక్టరేట్‌లో, ఇటు పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తానికి అధికారుల్లో గణతంత్ర వేడకల టెన్షన్ పట్టుకుంది. మొదట జిల్లా కలెక్టర్లకు సీఎస్ నుంచి అందిన ఆదేశాల ప్రకారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రసంగం, పరేడ్ లేకుండా సాదాసీదాగా నిర్వహించాలనుకున్నారు. అందుకు తగినట్లు ఏర్పాట్లు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పూర్తిగా కుదించారు. ఉత్తమ ఉద్యోగులకు మాత్రం అవార్డులు, ప్రశంసపత్రాలు సిద్ధం చేశారు. ఇలాంటి సమయంలో బుధవారం సాయంత్రం రాష్ట్ర హైకోర్టు తీర్పుతో జిల్లా యంత్రాంగం అయోమయంలో పడింది. కచ్చితంగా పరేడ్ నిర్వహించాలని, అన్ని కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. కాగా, కోర్టు ఉత్తర్వులను అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేడుకల నిర్వహణకు సంబంధించి కొత్తగా ఏమైనా చెబుతుందా అని రాత్రి పొద్దు పోయే వరకు ఎదురుచూసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో చివరి నిమిషంలో వేదిక మారినా ఇబ్బంది రాకుండా ఉండేందుకు కలెక్టరేట్‌తోపాటు పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులు మాత్రం రాత్రి వరకు ఉన్న సమాచారం ప్రకారం కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తున్నామని అధికారికంగా చెబుతున్నారు.



గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

వెంకటాపురం(కె): మండల పరిధి నూగూరు గ్రామ సమీపంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా.. వెంగళరావుపేట గ్రామానికి చెందిన సాధనపల్లి మౌళి, ఆలుబాక గ్రామానికి చెందిన బసరికారి కమల్ అనుమానాస్పదంగా పోలీసులకు కనిపించారు. వారిని తనిఖీ చేయగా.. గంజాయి లభ్యమైంది. చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నుంచి గంజాయి తీసుకొస్తూ పట్టుబడినట్లు వారు ఒప్పుకున్నారు. వారి వద్ద ఉన్న 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు వెంకటాపురం ఎస్సై అశోక్ తెలిపారు.

ఘనంగా శుద్ధి పండుగ

- మేడారం, కన్నెపల్లిలో ప్రత్యేక పూజలు


దోలు వాయిద్యాలతో సమ్మక్క గుడికి వస్తున్న పూజారులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ గుడి శుద్ధి పండుగ పూజా కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సమ్మక్క పూజారులు ఉదయాన్నే తలస్నానాలు ఆచరించి అమ్మవారి గుడికి వెళ్లి శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క పూజారి సిద్ధబోయిన మునీందర్ ఇంటి నుంచి పూజారి కొక్కెర కృష్ణయ్య, దూపవడ్డ నాగేశ్వర్‌రావు దూపం పట్టుకొని డోలు వాయిద్యాలతో పూజారులు సమ్మక్క గుడికి చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గుడిలో ఆడపడుచులు అమ్మవారి శక్తి పీఠం గద్దెను ముగ్గులతో అలంకరించారు. గుమ్మాల వద్ద ముగ్గులు వేశారు. అనంతరం పూజారులు దూప దీపాలు వెలిగించి, యాటను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం అడవి నుంచి కొత్తగా తీసుకవచ్చిన ఎట్టిగడ్డిని సమ్మక్క గుడి ఈశాన్య మూలకు ఉంచారు.

కన్నెపల్లిలో..

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో కూడా సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్యతో పాటు పూజారులు గుడిని శుద్ధి చేసి సారలమ్మ వడ్డెరలను పసుపు, కుంకుములు పెట్టి అలంకరించారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు. అమ్మవారి గుడి ఆవరణలో ముగ్గులు వేసి అలంకరించారు. ఈకార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు సిద్ధబోయిన మహేశ్, లక్ష్మణ్‌రావు, బొజారావు, జనార్దన్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

స్కూలుకెళ్లమన్నందుకు విద్యార్థి ఆత్మహత్య

- మృతదేహంతో ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల నిరసన
- ఆస్పత్రిపై దాడి.. పోలీసుల రంగప్రవేశం


నవ్య (ఫైల్)


ఆస్పత్రి ఎదుట బాలిక మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

కాశిబుగ్గ: స్కూలుకెళ్లమని తల్లిదండ్రులు మందలించినందుకు నగరంలోని చింతల్ ఆర్ఎస్‌నగర్‌కు చెందిన ముత్యాల నవ్య(15) ఆత్మహత్యకు యత్నించి బుధవారం మృతి చెందింది. నవ్య నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మంగళవారం ఆమె తల్లిదండ్రులు స్కూలుకు వెళ్లమని మందలించారు. మనస్తాపం చెందిన నవ్య ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. బాలిక చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బాలిక మృతి చెందిందని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తూ ఆసుపత్రి అద్దాలు ధ్వంసం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. పోలీసులు బాధితులను సముదాయించి ఆస్పత్రి యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈసందర్భంగా వరంగల్ ఏసీపీ గిరికుమార్ మాట్లాడుతూ.. అసుపత్రిలో చికిత్సలోపం జరిగిందని అనుమానం ఉంటే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు. కానీ ఆస్పత్రిపై దాడులు చేయడం సరికాదని, అమ్మాయి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నదన్న దానిపై కూడా విచారణ జరిపిస్తామన్నారు. ఈవిషయంపై ఆస్పత్రి యాజమాన్యం మాట్లాడుతూ.. కొన ఊపిరితో ఉన్న బాలికకు సీపీఆర్ చేసి కుటుంబీకులతో చర్చించి వైద్యం చేశామని, ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు. అయినప్పటికీ బాలిక కుటుంబ సభ్యులు రాత్రి వరకు ఆందోళను కొనసాగించారు. బాలిక తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్కు శ్రీనివాస్ తెలిపారు.

ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్న యువకుడి అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

వరంగల్ క్రైం: యువతి ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించిన యువకుడిని గీసుకొండ పోలీసులు అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటలక్ష్మి తెలిపారు. ఖిలా వరంగల్ మండలం దూపకుంట గ్రామానికి చెందిన జన్ను విజయ్‌కుమార్ ఏడాదిగా అదే గ్రామానికి చెందిన యువతితో చాటింగ్ చేస్తున్నాడు. ఈ చాటింగ్ వ్యవహారం సదరు యువతి అక్క దృష్టికి రావడంతో ఆమె అతడిని మందలించింది. కక్షగట్టిన విజయ్ యువతి ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసిన ఫొటోలు, అసభ్యకరమైన మెసేజ్‌లను బాధితురాలి ఫోన్‌కు పంపించాడు. దీంతోపాటు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కమిషనరేట్ సైబర్ క్రైం విభాగం సహకారంతో చేపట్టిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌రెడ్డి, ఎస్సై వెంకన్న, కానిస్టేబుళ్లు కిషోర్, సంపత్‌ను అభినందించారు.





వాటర్‌ఫౌంటేన్ కాదండోయ్..

ఈ ఫొటో చూస్తుంటే నీటి ఫౌంటేన్ గుర్తుకొస్తుంది కదూ.. నగరంలోని వడ్డేపల్లి చర్చి సమీపంలో జరుగుతున్న అభివృద్ధి పనుల సందర్భంగా పైప్‌లైన్ దెబ్బతినడంతో నీరంతా ఇలా ఎగిసిపడుతోంది.

– హసన్‌పర్తి

జీవిత ఖైదీ మృతి

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కరీంనగర్ జిల్లా ధర్మపురికి చెందిన జీవిత ఖైదీ గడ్డం శ్రీను బుధవారం మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. 2007 జూలైలో అదనపు సెషన్ జడ్జి యావజ్జీవ కారాగార శిక్ష విధించడంతో అతడు జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 24న అనారోగ్య కారణాలతో అతడిని ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకొచ్చారు. కాగా.. చికిత్స పొందుతూ బుధవారం శ్రీను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ల ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న మల్లారెడ్డి, అయిలయ్య

కేయూ క్యాంపస్: హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల 3వ, 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్ని కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య కళాశాలలో బుధవారం విడుదల చేశారు. ఈనెల 13న పరీక్షలు పూర్తికాగా.. కేవలం 12 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేశారు. 3వ సెమిస్టర్‌లో 49.90శాతం, 5వ సెమిస్టర్‌లో 73.42శాతం ఉత్తీర్ణత నమోదైంది. రీవాల్యుయేషన్ కోసం ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.275లు చెల్లించి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హనుమంతు, కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రాజు, గిరిప్రసాద్, కిష్టయ్య, విభాగాల అధిపతులు అంజన్‌రావు, చిర్ర రాజు, సురేశ్, రాజశేఖర్, రమేశ్, ప్రసాద్, పరహాఫాతిమా, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

'ఐ మిస్ యూ' అంటూ మహిళ ఆత్మహత్య

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన పశుసంవర్ధక శాఖలో బొల్లికుంట వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ల్యాదల్ల వినీత(40) ఇంటి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం ఉరివేసుకోగా.. సాయంత్రం వరకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం. వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ప్రభాకర్(సాల్మన్), వినీత ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉండగా.. ఆరు నెలల క్రితం ప్రభాకర్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఇదిలా ఉండగా.. వినీత కొంత కాలంగా మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా.. ఇద్దరి మధ్య ఇటీవల మనస్పర్థలు వచ్చాయని, సదరు వ్యక్తి ఆమెకు ఫోన్ చేయడం లేదని, దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటుందని అనుమానిస్తున్నారు. ఆమె సెల్ ఫోన్‌లో 'ఐ మిస్ యూ' అనే సందేశం ఉందని, ఈ క్రమంలోనే ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెబుతున్నారు. గీసుకొండ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. దీనిపై మృతురాలి బంధువులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

అనుమానాస్పద స్థితిలో నెలన్నర శిశువు మృతి


శిశువు మృతదేహం

ఖానాపురం: మండలంలోని కొత్తూరులో బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో నెలన్నర శిశువు మృతి చెందింది. నెక్కొండ మండలం దీక్షకుంట్ల గ్రామానికి చెందిన అంకేశ్వరపు రామకృష్ణ, రచన దంపతులకు ఇటీవల ఆడశిశువు జన్మించింది. ఈక్రమంలో రచన కొత్తూరులోని అమ్మమ్మ ఇంటి వద్దకు వచ్చి ఉంది. కాగా..45 రోజుల పాపను గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్‌కు తీసుకెళ్లి నెల ఇంజెక్షన్‌లు వేయించారు. సుమారు గంటకు పైగా సెంటర్‌లోనే ఉన్నారు. ఆతర్వాత శిశువును ఇంటికి తీసుకెళ్లిన తర్వాత అస్వస్థతకు గురయ్యింది. కుటుంబ సభ్యులు నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేసి శిశువు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని తల్లిదండ్రులు రచన-రామకృష్ణ తెలిపారు. కాగా.. ఇంజెక్షన్‌లు వికటించడం వల్లే శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

FINANCE

- హౌజింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును. & IT Returns, GST License చేయబడును. SRI SAI FINANCE, HNK. 7842279342. [WA-6459]

VISION WATER PURIFIER

- New year Offers 50% Discount All Purifier Sales & Service. Cell: 8499004848, 9652104848. [WA-6452]

SAVE WATER

- ఫ్లోగార్డ్ వాటర్ ట్యాంక్ ఓవర్ ఫ్లో కంట్రోలర్స్ అమర్చబడును. ట్యాంక్ నిండగానే ఆటోమెటిక్‌గా మోటరు బంద్ అగును. సెల్: 8464856262. HNK. [WA-2393]

LOANS

- బాలాజీ కన్సల్టెంట్ : (IT రిటర్న్స్, GST, పాన్‌కార్డ్స్) చేయబడును. బిజినెస్ లోన్స్, మార్టిగేజ్, పర్సనల్ లోన్స్ ఇప్పించబడును. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. సంప్ర॥ 8522825358, 9701432393 [M-1190555]

WANTED

- OT (Operation Theater) Assistants, Receptionsts, Pharmacist System Operators & Men Dhobi Workers. Cont: Guardian Hospital, Mulugu X Road, Warangal 12 to 2PM. [WA-0179]
- సముద్ర నాన్ వెజ్ మార్ట్ నందు కట్టింగ్ మాస్టర్స్ కావలెను. చికెన్, మటన్, ఫిష్ & కర్రీ పాయింట్‌లో కర్రీస్ పార్సిల్ చేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. విష్ణుప్రియ గార్డెన్ రోడ్, హంటర్ రోడ్, 9063332016, 9063332017. [WA-6465]
- హన్మకొండలోని డిస్ట్రిబ్యూటర్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. సంప్ర॥ 8686858074, 7730008943. [W-1170512]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779863]
- అతి తక్కువ పెట్టుబడితో కంపెని నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి క్రొత్త రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ : 8465843194 [G-353]
- Wanted Agents: HNK లో నూతనముగా నిర్మించిన అపార్ట్‌మెంట్ నందు Flats అమ్మడానికి ఏజెంట్స్ కావలెను మంచి కమీషన్ ఇవ్వబడును. Cont: 9849101554. [WA-2918]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 7569955551/ 9848571888 [H-786823]
- షిర్డీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-10046]

WANTED TEACHERS

- Wanted Teachers to teach I to VI Hindi, SS, Tel (FT), Maths for IX, X (PT), Kothur, HNK. Cell: 8374040935, 9182538110. [WA-6463]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/-రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9505507558
9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.